క్లుప్తంగా

24న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 24వ తేదిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకుడు లక్ష్మంపల్లె వెంకట్రాముడు శుక్రవారం తెలిపారు. భక్తులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో గ్రామోత్సవం ఉంటుందని, భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకోవాలని కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కొలిమిగుండ్ల: గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేస్తున్న మొబైల ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం హనుమంతుగుండం, తిమ్మనాయినపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్లను ఆయన పరిశీలించారు. కొత్తగా ఆధార్ ఎన్‌రోల్‌తో పాటు పేర్లు మార్పులు చేర్పులు తదితర సేవలు పొందవచ్చని సూచించారు.

23నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

కోవెలకుంట్ల: స్థానిక ఐదవ సచివాలయ పరిధిలో ఈనెల 23న సాయంత్రం 3గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉప సర్పంచి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అలాగే 24, 25 తేదీల్లోనూ ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరు కావాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొలిమిగుండ్ల: మద్యం, పొగతాగడం తదితర మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని సమత సొసైటీ మేనేజర్ భాస్కర్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని చింతలాయిపల్లె ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాలరాజు ఆధ్వర్యంలో మత్తు పదార్థాల మూలంగా జరిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించడం, పొగతాగడం మూలంగా అనారోగ్యానికి గురవుతారన్నారు. మత్తుకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అత్యవసర చికిత్స అవసరమైన వారిని ఆసుపత్రికి రెఫర్ చేశారు. కార్యక్రమంలో డీఅడిక్షన్ హాస్పటల్ ట్రైనర్ రవి, కౌన్సిలర్ సలీం, పంచాయతీ కార్యదర్శి భార్గవి, గ్రామ పెద్ద అంబటి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలి



చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ రాధిక

కోవెలకుంట్ల: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని ఈఓపీఆర్డీ రాధిక సూచించారు. శుక్రవారం మండలంలోని చిన్నకొప్పెర్ల గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను సర్పంచ్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్‌తో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కార్మికులకు సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి నితీష్

ప్యాపిలి: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్యాధికారి నితీష్ సూచించారు. స్థానిక బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఈ సందర్భంగా నితీష్ విద్యార్థులకు సూచించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బీసీ కాలనీలో ప్రజలకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. హైపర్ టెన్షన్, డయబెటిస్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించి అవసరం అ యిన వారికి మందులు పంపిణీ చేశారు. కా ర్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేంద్రగౌడ్, గంగాదేవి, శ్రీజ, అమర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి తరహాలో ప్రత్యేక అభిషేకాలు

డోన్ టౌన్: తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రతి శనివారం నిర్వహించే పూజలు, అభిషేకాల తరహాలో డోన్‌లోని శ్రీగోదాదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ ఉంటాయని ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ శుక్రవారం తెలిపారు. ఇక నుంచి ప్రతి శనివారం పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

పేద వధువులకూ ‘చేయూత’

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలతో ప్రభుత్వం ఆర్థిక సాయం
- అక్టోబర్ నుంచి నమోదు చేపట్టిన అధికారులు
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 79 జంటలు
- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



బనగానపల్లె: పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తూ అండగా నిలుస్తున్న ప్రభుత్వం అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగులకు ఒకటవ తేదీన ఇంటి వద్దనే ఠంఛన్‌గా పింఛన్ అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తున్న విషయం తెలిసిందే. అదేవిధంగా మహిళల ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేయూత, ఆసర తదితర పథకాలు అమలు చేస్తున్న వైఎస్సార్ సీపీ సర్కార్ బడుగు, బలహీన వర్గాల యువతులకు చేయూత అందించేందుకు శ్రీకారం చుట్టింది. పేద వధువుల వివాహానికి ఆర్థిక సాయం అందజేసేందుకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా (ముస్లింలకు)పథకాల అమలు చేపట్టింది ప్రభుత్వం. దీంతో అన్ని వర్గాల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గతేడాది అక్టోబరు 1 నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించగా ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 79 జంటలు నమోదు చేసుకున్నారు. కొన్ని దరఖాస్తులు ఎంపీడీఓ, గ్రామ సచివాలయాల లాగిన్‌లో ఉన్నట్లు సమాచారం. సమగ్ర పరిశీలన అనంతరం ఆమోదం కోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తులు పంపనున్నారు. గత టీడీపీ పాలనలో ఈ పథకం అర్హులకు వర్తించలేదనే ఆరోపణల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఎవ్వరి సిఫారసు లేకుండా నేరుగా అర్హులైన వధూవరులు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేలా ప్రణాళికలు రూపొందించింది. పేద వధువుకు నిబంధనల మేరకు అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అందజేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా కులాంతర, దివ్యాంగ వివాహాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తూ కానుకలు అంజేస్తుంది.

దరఖాస్తు చేయడం ఇలా...

వధూవరులు వివాహం జరిగిన 60 రోజులోపు ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలి. ఇందుకు వివాహ ధ్రువపత్రాలు, రేషన్ కార్డు జతపరిచాల్సి ఉంటుంది. పెళ్లి పత్రికలు, పెళ్లి సమయంలో దిగిన ఫోటోలు, వివాహ సర్టిఫికెట్, ఆధార్, కుల ఆదాయం ధృవీకరణ పత్రంతో పాటు వధువు బ్యాంకు ఖాతా జిరాక్స్ అందించాలి. అదేవిధంగా వధువరుల చదువుకు సంబంధించి 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు దరఖాస్తుకు జత చేయాల్సి ఉంటుంది. భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వ ధ్రువీకరణ పత్రం అందజేయాలి.

ప్రభుత్వ ఆర్థిక సాయం ఇలా...

కులం	ఆర్థిక సాయం
ఎస్సీ	రూ.లక్ష
కులాంతరవివాహం	రూ.1.20లక్షలు
ఎస్టీలు	రూ.లక్ష
బీసీలు	రూ.50వేలు
బీసీకులాంతర	రూ.75వేలు
దివ్యాంగ	రూ.1.50లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.40వేలు
మైనార్టీలు	రూ.లక్ష

పేదలకు ఆర్థిక అండ



పేదల వివాహాలకు ఆర్థిక సహాయం అందజేయడానికి వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదితోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది. పేదలకు ఆర్థిక అండగా నిలుస్తుంది. ఇంత వరకు జిల్లాలో 79 జంటల నుంచి దరఖాస్తులు చేరాయి. కులాల వారీగా ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుంది. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి కూడా ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందజేస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు వివాహాలు అయిన వెంటనే నూతన దంపతులు సంబంధింత గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీధర్‌రెడ్డి, పీడీ డీఆర్‌డీఏ నంద్యాల జిల్లా

22న మంత్రి బుగ్గన పర్యటన

బేతంచెర్ల: బేతంచెర్లతో పాటు ఆర్ బుక్కాపురం గ్రామంలో అభివృద్ధి పనులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 22న ప్రారంభించనున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆదివారం ఉదయం పట్టణంలోని ఆంజనేయ, చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణంలో రూ.1.50 కోట్లతో చేపట్టే వినాయక, వేణుగోపాల స్వామి, మాధవ స్వామి ఆలయాల పునర్నిర్మాణం, ఉత్తర ద్వారం, కాలేక్షప మండప నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేస్తారన్నారు. అదేవిధంగా డ్రైవర్స్ కాలనీలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్ బుక్కాపురం గ్రామంలో రూ. 42 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన రహదారిని మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోకి మంత్రి పాదయాత్రగా వెళ్తారని, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

గ్రామదేవతలకు పుష్యమాస పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్టపెద్దమ్మకు శుక్రవారం పుష్యమాసాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తొట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం శుక్రవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీ ఉమా మహేశ్వరస్వామి వార్లకు అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను వధువరులుగా అలంకరించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. హిందూ ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతినెలా మాసశివరాత్రి రోజును స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

శ్రీ ఉమామహేశ్వరస్వామికి వెండి బిందె విరాళం



అర్చకులకు వెండిబిందెను అందజేస్తున్న దాత యర్రంశెట్టి నాగేశ్వరరావు

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమా మహేశ్వరస్వామి ఆలయానికి పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన యర్రంశెట్టి కుటుంబ సభ్యులు కిలో వెండి బిందెను విరాళంగా అందించారు. మొక్కుబడిలో భాగంగా దాత వెండిబిందె విరాళంగా అందజేశారని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు మహేశ్వర శర్మ తెలిపారు. దాతను సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని హుసేనాపురం సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యాపిలి ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలతో పాటు పీఆర్ పల్లి, నల్లమేకలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అవుకు మండలంలో....

అవుకు: మండల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య శుక్రవారం తెలిపారు. అవుకు, గుడ్లశింగవరం, రామాపురం, ఉప్పలపాడు సబ్ స్టేషన్లలో మూడవ శనివారం మెయింటెనెన్స్‌లో భాగంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌ను నిలివేస్తున్నామని, వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

డోన్‌లో....

డోన్ టౌన్: మండల పరిధిలోని నుసుసుర్లాళ్ల 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని అలంకొండ 33 కేవీ ఫీడర్ మరమతుల నేపథ్యంలో శనివారం మల్యాల, యు.కొత్తపల్లె సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నామని, సహకరించాలని కోరారు.


బనగానపల్లెలో....

బనగానపల్లె: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. బనగానపల్లె, పాతపాడు, పసుపల సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బేతంచెర్లలో....

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంతో పాటు రంగాపురం అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మధు సూదన్ రెడ్డి, ఏఈఈలు శ్రీనివాసులు, మహబూబ్‌వలీ శుక్రవారం తెలిపారు. సిమెంట్ నగర్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు, పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు.

రక్తదానం చేసిన స్ఫూర్తి సభ్యులు



రక్తదానం చేస్తున్న రంగస్వామి

డోన్ టౌన్: అత్యవసర పరిస్థితుల్లో ఉన్న నిండు గర్భిణులకు ప్రసవం నిమిత్తం స్ఫూర్తి సేవా సమితి సభ్యులు రంగస్వామి, రాములు రక్త దానం చేసి మానవత్వం చాటుకున్నారు. డోన్ మండలం చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన గర్భిణి రమాదేవి కాన్పు నిమిత్తం అరుదైన 0 నెగిటివ్ రక్తం అవసరం కావడంతో అబ్బిరెడ్డిపల్లెకు చెందిన రంగస్వామి రక్త దానం చేశాడు. అలాగే కర్నూలుకు చెందిన గర్భిణి ప్రత్యూషకు బి. పాజిటివ్ రక్తం అవసరం ఉన్నట్లు వాట్సాప్ ద్వారా తెలుసుకున్న రాము శుక్రవారం కర్నూలుకు వెళ్లి రక్తదానం చేశాడు. రక్త దాతలను స్ఫూర్తి సేవా సమితి వ్యవస్థాపకుడు సీసంగుంతల మధు తోపాటు పలువురు అభినందించారు.

జీవీఎంసీని సందర్శించిన డోన్ కౌన్సిలర్లు



జీవీఎంసీ అమలు చేస్తున్న అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వీక్షిస్తున్న డోన్ మున్సిపాలిటీ కౌన్సిలర్ల బృందం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): డోన్ మున్సిపాలిటీ చైర్మన్ సప్తశైల రాజేష్ నేతృత్వంలోని 34 మంది కౌన్సిలర్లు శుక్రవారం జీవీఎంసీని సందర్శించారు. వారికి మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, జీవీఎంసీ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. జీవీఎంసీలో చేపడతున్న అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నగరంలో చేపడతున్న 24 గంటల తాగునీరు, మురుగునీటి శుద్ధి కేంద్రం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లు, కాలువల నిర్మాణం, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కాపులుప్పాడ డంపింగ్‌యార్డ్‌లో జిందాల్ విద్యుత్ ప్లాంట్, సోలార్ పవర్, జీవీఎంసీ ఆదాయ వనరులు తదితర అంశాలను అదనపు కమిషనర్లు వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్ వర్మ, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్ వివరించారు. అనంతరం కౌన్సిలర్లకు జీవీఎంసీ తరపున మేయర్ జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా డోన్ మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జీవీఎంసీ చేపడతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆదర్శంగా ఉన్నాయని, ఈ తరహా అభివృద్ధిని డోన్ మున్సిపాలిటీలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

ఎల్లోమీడియా దుష్ప్రచారం తగదు!



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఎల్లోమీడియా దుష్ప్రచారం చేయడం తగదని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతుంటే ఏనాడూ తప్పుపట్టని ఎల్లోమీడియా ఇళ్ల వద్దకే వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతుందని విమర్శించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఎల్లోమీడియా తీరును తప్పుపట్టారు. వారం రోజులుగా దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్న ఈనాడు దిన పత్రిక వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. పింఛన్ మంజూరుకు అభాగ్యుల నుంచి మామూళ్ల వసూళ్లు చేసిన జన్మభూమి కమిటీ సభ్యుల అవినీతి అప్పుడు ఎల్లోమీడియాకు కనిపించలేదా అని ప్రశ్నించారు. ఉపాధి జాబ్ కార్డు కావాలన్నా... గృహం మంజూరు కావాలన్నా... ప్రతి పనికీ లంచాలు తీసుకున్న తెలుగు తమ్ముళ్ల తీరు అనాడు... ఈనాడుకు కనిపించకపోయినా ప్రజలకు తెలుసన్నారు. పింఛన్ కోసం గంటల తరబడి నిరీక్షించి కూడా చెయ్యి తడపిన సంఘటనలు ఎల్లో మీడియాకు కనిపించనప్పటికీ లంచం ఇచ్చి ఇబ్బందులు పడిన వృద్ధులు, వికలాంగులను పలుకరిస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. నేడు తెల్లవారంగానే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వలంటీర్లు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తుంటే ఓర్వలేక తప్పుడు కథనాలు రాయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. చరిత్రలో కనీవినీ ఎరుగని సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న జననేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా ఎదుర్కోలేకనే చంద్రబాబునాయుడు టీవీ 5, ఈనాడు, ఈటీవీ, ఏబీఎన్, ఆంధ్రజ్యోతి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌లను కూడగట్టుకుని కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, ఇలాగే తప్పుడు రాతలు రాస్తే ప్రజావ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పోస్టుప్రసాద్, కురుకుంద హరి, ఆర్ఈ రాజవర్ధన్, ఓబులాపురం మధన్, మహేష్, ధంకేష్, కుళ్లాయి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లెరూరల్: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఇమాంస ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇమాంస మాట్లాడుతూ యూరియ, డీఏపీ ఎరువులను ఎమ్మార్పీ కంటే రూ.100 ఎక్కువకు అమ్ముతున్నారని ఆరోపించారు. అనంతరం మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఓబులేసుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, శివ, రైతులు ఉసేని, సుబ్రహ్మణ్యం, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన ఉండాలి

డోన్ : రోడ్డు నిబంధనలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఎంవీఐ క్రాంతికుమార్ తెలిపారు. 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా పట్టణ సమీపంలోని ఓ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనచోదకులు పాటించాల్సిన నిబంధనలను ఎంవీఐ విద్యార్థులకు వివరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోవెలకుంట్ల:సంజామల మండలం పేరుసోముల జెడ్పీ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థినులు యామిని, లక్ష్మీలీలావతి అండర్–17 విభాగంలో బాల్‌బాడ్మింటన్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజ్యలక్ష్మీదేవి తెలిపారు. ఈనెల 23 నుంచి 25వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగే జీఆర్‌జే స్కూల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ 1, 2,4 అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు శుక్రవారం దాత ఖాజా సహకారంతో రోటరీ క్లబ్ సభ్యులు 60 ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులకు అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి,నాగలక్ష్మి, అంజమ్మ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మద్దిలేటిస్వామి అధ్యక్ష, కార్యదర్శులు జశ్వంత్ రెడ్డి, సునీల్ కుమార్, సభ్యులు వీరారెడ్డి, అల్తాఫ్, మోహన్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్ మార్కెట్ యార్డ్‌కు నూతన పాలక మండలి

- చైర్మన్‌గా రాజా నారాయణ మూర్తి, వైస్ చైర్మన్ గొల్ల ఓబులాపురం భారతి
- ఈనెల 23న ప్రమాణ స్వీకారం



రాజా నారాయణ మూర్తి



గొల్ల ఓబులాపురం భారతి

డోన్ : స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ నెల 9వ తేదీన డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ జీఓ ఆర్టీ నంబర్ 867 ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ప్యాపిలి పట్టణానికి చెందిన రాజా నారాయణ మూర్తిని, వైస్ చైర్మన్‌గా ఓబులాపురం గ్రామానికి చెందిన భారతిని ప్రభుత్వం నామినేట్ చేసింది. డైరెక్టర్లుగా నీలకంటి విజయ లక్ష్మి, దిగువపాటి లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, మంతి పెద్ద మద్దయ్య, పెద్దవాని శివమ్మ, గొల్ల వెంకటేశ్వర్లు, ఘూడ మద్రు రవికుమార్, హరిజన మద్దమ్మ, కాద్రోతు లక్ష్మీ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, హరిక్రిష్ణ, ఆరవేటి ఇందుమతి ఎన్నికయ్యారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే, డోన్ బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్‌లు, జిల్లా అగ్రిట్రేడ్ అధికారి డైరెక్టర్లుగా ఉంటారని ప్రభుత్వం ఉత్తర్వులు పేర్కొంది. డోన్ మార్కెట్ యార్డు ఆవరణలో ఈనెల 23న నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

బనగానపల్లెరూరల్: బాలికలు బాలురతో సమానంగా అన్నిరంగాల్లో రాణించా లని బనగానపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక వారోత్సవాల్లో భాగంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి ఆధ్వర్యంలో విదార్థినులకు క్రీడాలతో పాటు పలు రంగాల్లో రాణించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా బేటిబచావో బేటి బడావో కార్యక్రమంపై డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు సాలమ్మ,చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

అవుకు: బాలురతో సమానంగా బాలికలు మానసికంగానూ దృఢంగా ఉంటూ చదువులోనూ, క్రీడల్లోనూ ముందుకు సాగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ అన్నారు. శుక్రవారం అవుకు మండలం గుండ్లశింగవరం గ్రామంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో హెచ్‌ఎం రామానాయక్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా శివమ్మ ఆడపిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రీడల ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో పీఈటీ సుధాకర్, మహిళా పోలీస్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు అనసూయ దేవి, ప్రశాంతి పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



బాలింతతో పాటు చిన్నారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు వైద్యుల సూచనలను పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. శుక్రవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాతపాడులో వైద్య సిబ్బంది పర్యటించారు. ఆరోగ్య పరీక్షలు, అవసరం ఉన్నవారికి మందుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకరుడు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి వైద్యులను పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మహేశ్వరి,ఏఎన్‌ఎం శాంతమ్మ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వరుసగా ఎద్దులు చోరీ

డోన్ రూరల్/ టౌన్: జాతీయ రహదారిపైన ఉన్న గ్రామాలకు చెందిన రైతన్నల ఎద్దులు వరుసగా చోరీకి గురవుతున్నాయి. గురువారం అర్ధరాత్రి డోన్ సబ్ డివిజన్ పరిధిలోని ప్యాపిలి మండలం ఏనుగుమర్రి గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు తన ఎద్దులను ఆవరణలో, మండలంంలోని వెంకటాపురరానికి చెందిన హరిజన పెద్దయ్య తన ఎద్దులను కల్లం దొడ్డిలో, ఆదే గ్రామానికి చెందిన కౌలురైతు బోయ వెంకటేష్ తన ఎద్దులను ఇంటి సమీపంలోని లొద్ద రామిరెడ్డి ఇంటి ఆవరణలో కట్టేశారు. అయితే శుక్రవారం ఉదయం చూడగా ఇందులో ఒక్కొక్క ఎద్దు కనిపించలేదని రైతులు తెలిపారు. రాత్రి వేళలో ఎద్దుకు కట్టిన తాడు ఊడిపోవడం లేదా తెగి పోయిన కారణంగా ఎక్కడికైనా పోయి ఉంటాయని వెతికినా ఆచూకి లభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లలో ఏనుగుమర్రి గ్రామంలోనే దాదాపు 12 ఎద్దులు చోరీకి గురైనట్లు ఆ గ్రామ ప్రస్తుత సర్పంచ్ కరణం మోహన్ తెలిపారు. పోలీసు అధికారులు నిఘా పెంచాలని కోరారు.